
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 17 జనవరి 2025




• రోజు వడ్డీకి అప్పు తెచ్చి..

నరసాపురం పట్టణానికి ఓ చిరు వ్యాపారి పండుగ నిమిత్తం వ్యాపారుల వద్ద రూ.10 వేలు అప్పు తీసుకు న్నాడు. ఈ మూడు రోజులు వ్యాపారం చేయలేదు. తీసుకున్న అప్పును గుండాటలో పోగొట్టాడు. చివరికి మిగిలిన రూ.10 వేల అప్పును రోజుకు రూ.120 చొప్పున వంద రోజుల్లో చెల్లించాలి. ఇది పండుగ మిగిల్చిన అప్పు.

• సరదాగా గడుపుదామని వచ్చి..

హైదరాబాద్ నుంచి ఓ చిరుద్యోగి కుటుంబంతో సరదాగా గడుపుదామని స్వగ్రామం వచ్చాడు. చిన్ననాటి స్నేహితులతో కలిసి పట్టణంలోని ఓ పెద్ద బరిలో పందేలు చూసేందుకు వెళ్లాడు. స్నేహితులు పందేలు కాస్తుండటంతో మనసు అటు లాగి జేబులో చేయి పెట్టాడు. గంటలో రూ.5 వేలు పోయాయి. అంతటితో ఆగలేదు. ఇంటికి వెళ్లి భార్య దగ్గర ఉన్న రూ 10 వేలు తెచ్చి మరి పందెం పెట్టాడు. చివరికీ హైదరాబాద్ వెళ్లేందుకు డబ్బులు కూడా లేకపోవడంతో స్నేహితుల దగ్గర అప్పు తీసుకుని మరీ వెళ్లాల్సి వచ్చింది.

• రైతుకు మిగిల్చిన అప్పు.. అక్షరాలా లక్ష



మొగల్తూరు ప్రాంతానికి చెందిన ఓ రైతు సరదాగా పందేలు కాద్దామని అనుకున్నాడు. రూ.20 వేలు జేబులో వేసుకుని ఇంటి నుంచి బయలుదేరాడు. మధ్యాహ్నానికి మరో 20 వేలు వచ్చినట్టే వచ్చి మొత్తం పోయాయి. తెలిసిన వారి వద్ద నాలుగు రూపాయల వడ్డీకి రూ.20 వేలు అప్పు తెచ్చి పందెంలో పెట్టాడు. ఇవీ పోయాయి. కసి పెరిగింది. పోయిన ఇరవై వేలు ఎలాగైనా సంపాదించాలనుకుని ఇంటిలోవున్న బంగారం తాకట్టు పెట్టి రూ.60 వేలు అప్పు తెచ్చాడు. గంటల వ్యవధిలో ఇది కూడా తుడిచి పెట్టుకుపోయింది. చివరకు పండుగ పేరుతో తెచ్చిన లక్ష రూపాయల అప్పు మిగిలింది.

• పది వేలు గెలిచి.. రెండున్నర లక్షలు పోగొట్టి

తాడేపల్లిగూడెం మండలంలో కూలి పనులు చేసుకునే ఓ వ్యక్తి కోడి పందేల బరికి వెళ్లాడు. గుండాటలో సరదాగా పందెం కాస్తే ఓ పది వేలు వచ్చాయి. ఇదేదో బాగుంది కదాని జోరు పెంచాడు. ఈ సొమ్ము రావడానికి నాలుగు గంటలు పడితే.. అది పోగొట్టడానికి నాలుగు నిమిషాలు పట్టలేదు. మళ్లీ ఇంటికి వెళ్లి మరో రూ.20 వేలు తెచ్చి పందెం కాశాడు. నిమి షాల వ్యవధిలో అదీపోయింది. అతనిలో కసి పెరిగి, పొరుగింటి వాళ్ల దగ్గర అప్పు చేసి మరీ ఆడాడు. ఇలా సంక్రాంతి మూడు రోజుల్లో పందేల్లో పోయిన సొమ్ము అక్షరాలా రెండున్నర లక్షల రూపాయలు. కుటుంబసభ్యులు లబోదిబోమనడంతోపాటు ఆ వ్యక్తికి చీవాట్లు పెట్టడంతో ఇంటి నుంచి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఏమైనా అఘాయిత్యం చేసుకుంటాడేమోనని భయపడి బ్రతిమలాడి ఇంటికి తీసుకువచ్చారు. చేసిన అప్పులు ఏదో లా తీర్చుకుందామని ఆ ఇంటి ఇల్లాలు సర్ది చెప్పేసరికి కాస్త శాంతించాడు.

రారాజు నెమలి

సంక్రాంతి బరిలో నెమలి రకం కోడి పుంజు రారాజుగా నిలిచింది. పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో మూడు రోజులపాటు జరిగిన అన్ని పందేల్లోను నెమలి హవా కొనసాగింది. దీంతో ఈ రకం పుంజులకు డిమాండ్ పెరిగింది. పందెపు రాయుళ్లు అధిక శాతం నెమలిపై హెచ్చు పందేలు కట్టారు.

ఇలా ఒకరు, ఇద్దరూ కాదు. పండుగ పేరుతో నిర్వహించిన జూదంలో ఎంతో మంది సామాన్య, మధ్య తరగతి వారి జేబులే కాదు. బ్యాంకు ఖాతాలు కూడా ఖాళీ అయ్యాయి. లక్షల్లో అప్పులు మిగిలాయి. కొందరి ఆస్తులు తాకట్టులోకి వెళ్లాయి. మొత్తం మీద ఇలాంటి జూదగాళ్లందరికీ సంక్రాంతి సరదా తీర్చేసింది !



సంక్రాంతి సరదా తీర్చేసింది..!

జిల్లాలో ముగిసిన కోడి పందేలు.. జూదాలు
వేలు, లక్షలు పోగొట్టుకున్న జనం
పదిలో ఒక్కరికే లాభం.. తొమ్మిది మందికి నష్టం
లక్షలు వస్తాయనుకుంటే అప్పులు మిగిలాయి



తాడేపల్లిగూడెం రూరల్/నరసాపురం/ఆచంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి మాటున పుంజుల ప్రాణాలను పణంగా పెట్టి ఏడాది పొడవునా కష్టపడ్డ సొమ్ములు చేతపట్టి పందెం రాయుళ్లు బరిలోకి దిగారు. పండగ మూడు రోజులు అయ్యేసరికి చేతిలో చిల్లిగవ్వ లేక అప్పులపాలై చతికిలపడ్డారు. కోట్లాది రూపాయలు పందేల మాటున చేతులు మారగా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎపుడూ లేని విధంగా ఈ సారి సంక్రాంతి పండుగ పురస్కరించుకుని చిన్నారుల నుంచి పెద్దల వరకు, యువతుల నుంచి మహిళల వరకు వయోభేదం, లింగ భేదం లేకుండా జూదాల్లో పాల్గొన్నారు. కోతాట, మూడు ముక్కలాట, గుండాట వంటి జూదాలు కోట్లు చేతులు మారాయి. గోదావరి జిల్లాల్లో ఈ సంస్కృతి ఈసారి మరీ విపరీతంగా మారింది. ఎంత విపరీతం అంటే ఒక్క పందే నికి కోటి పాతిక లక్షలు పణంగా పెట్టేంత ! అంటే నాలుగు నిముషాల పందేనికి రెండున్నర కోట్లు చేతులు మారేంత ! అయినా పందేల బరిలోకి దిగిన తర్వాత ఇవి సర్వసాధారణం. అయినా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు కొందరు పేద, మధ్య తరగతి ప్రజలు ఈ పందేల మోజులో సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఈ పందేల్లో పది మందిలో తొమ్మిది మంది డబ్బులు పోగొట్టుకోగా ఒకరు మాత్రమే సొమ్ములు కళ్లజూశారు.



ఆకివీడులో పందెం రాయుళ్లను ఇళ్లకు పంపుతున్న పోలీసులు

నాలుగో రోజు నిలిచిన కోడి పందేలు

ఆకివీడు/తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం రూరల్/కాళ్ల/మొగల్తూరు/తణుకు రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు కోడి పందేలు, జూదాలను పట్టించుకోని పోలీసులు గురువారం రంగంలోకి దిగారు. ఆకివీడులో వేసిన బరుల వద్దకు చేరుకుని పందెం రాయుళ్లను అడ్డుకున్నారు. పందేలు వేసేందుకు ఆడవారుతో సహా బరులకు కోడి పుంజులతో వచ్చిన వారినందరిని వెనుక్కు పంపారు. బరుల దగ్గర ఉన్న జూదం, గుండాట తదితర ఆటల టెంట్‌లు తీయించారు. తినుబండారాలు అమ్మే వారిని అక్కడి నుంచి పంపించేశారు. చిన్న బరులు దగ్గర పందేలు నిర్వహిస్తుండగా పోలీసులు రావడంతో వారంతా పారిపోయారు. ఎవరైనా కోడి పందేళ్లు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ జగదీశ్వరరావు హెచ్చరించారు. ముందురోజు వరకు లేడీ బౌన్సర్లతో సందడి చేసిన తాడేపల్లిగూడెం కోడి పందేల బరిలో కుర్చీలు ఖాళీగా మారి బోసిపోయాయి. భీమవరం మండలం తుందుర్రులో గురువారం మధ్యాహ్నం రెండు గంటల వరకు కోడి పందేలు వేశారు. మిగిలిన ప్రాంతాల్లో నిలిచిపోవడంతో ఉదయం ఇక్కడకు పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. విషయం పోలీసులకు తెలియడంతో నిలిపివేశారు. ఈ పందేలు జరిగినంత సేపు గుండాటలు కొనసాగాయి. కాళ్ల మండలం పెద అమిరం, సీసలి బరుల్లో గురు వారం కూడా పందేలు నిర్వహిస్తామని ప్రకటించడంతో కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పందెగాళ్లు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత పందేలు లేవని నిర్వాహకులు ప్రకటించడంతో నిరాశతో వెనుదిరిగారు. పోలీసుల నుంచి హెచ్చరికలు రావడంతో మొగల్తూరు మండలంలో గురువారం ఎక్కడా పందేలు నిర్వహించలేదు. పందేల కోసం ఎదురుచూసిన వారు నిరాశతో వెనుతిరిగారు. తణుకు మండలంలో మూడు రోజులుగా కోడి పందేలు సాగాయి. నాలుగో రోజు పందేలు నిర్వహించేందుకు గురువారం పోలీసులు అడ్డుకున్నారు. మూడు రోజులపాటు యథేచ్ఛగా కోడి పందేలతోపాటు గుండాట, కోతాట, పేకాటలు యదేచ్ఛగా నిర్వహించారు. మండలంలో కోడి పందేలు నిర్వహణపై 17 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు.

జూదగాళ్లపై కేసులు

భీమవరం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి పండుగ మూడు రోజులు కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తున్న వారిపై 415 కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో కోడి పందేలు నిర్వహిస్తున్న 545 మందిని అరెస్ట్ చేసి 245 కేసులు నమోదు చేశారు. నాలుగు లక్షల ఐదు వేల 550 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. 293 కోడి పుంజులు, 342 కోడి కత్తులను పట్టుకున్నారు. పేకాడుతున్న 189 మందిని అరెస్ట్ 103 కేసులు నమోదు చేసి, లక్షా 47 వేల 11 రూపాయలు సీజ్ చేశారు. గుండాటకు సంబంధించి 67 కేసులు నమోదు చేసి 236 మందిని అరెస్టు చేశారు. లక్షా 83 వేల 20 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. 102 ఫ్లెక్సీలను సీజ్ చేశారు. పోలీసుల రికార్డుల ప్రకారం నమోదైన కేసులవి. లెక్కల్లో లేనివి చాలా ఉన్నాయి. ఇప్పటికే కొన్ని వందల కోట్లు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. తాడేపల్లిగూడెం పట్టణంలో ఒక్క కోడి పందెమే రూ.కోటి 25 లక్షలు పలికిందంటే జిల్లాలో ఏ విధంగా పందేలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. నాయకుల ఒత్తిళ్లో లేక అధికారుల ఒత్తిళ్లో కాని పోలీసులు మాత్రం కోడి పందేలు, జూదాల జోలికి వెళ్లకుండా మిన్నకుండిపోయారన్న ప్రచారం జరుగుతోంది.



జూదం.. మద్యం కుమ్మేశారు

మద్యం అమ్మకాల జోరు

పెరిగిన వినియోగం.. తగ్గిన ఆదాయం
సంక్రాంతి అమ్మకాల్లో మతలబు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)
పండుగ రోజుల్లో మద్యం వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రధానంగా బీరు అమ్మకాలు వంద శాతం అధికమయ్యాయి. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభం నుంచి సంక్రాంతి పండుగ వరకు జిల్లాలో మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ లెక్కలు తీసింది. వినియోగం పెరిగినా సరే ఆదాయం రాలేదు. గత ఏడాది కంటే తక్కువగానే ఆదాయం వచ్చింది. గత ఏడాది రూ.79 కోట్లు టర్నోవర్ నమోదైంది. అదే జనవరి ఒకటి నుంచి 16 వరకు ఈ ఏడాది రూ.76 కోట్లు మాత్రమే మద్యం అమ్మకాల్లో టర్నోవర్ సాధించారు. వినియోగం మాత్రం గణనీయంగా పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 175 మద్యం షాపులు, 26 బార్లలో గడిచిన 16 రోజుల్లో 52 వేల బీరు కేసులను విక్రయించారు. అదే గత ఏడాది ఇదే సమయంలో 25 వేల కేసుల బీర్లు మాత్రమే అమ్ముడుపోయాయి. లిక్కర్ విషయానికొస్తే 86 వేల కేసులు గత ఏడాది అమ్మగలిగారు. ఈసారి 88 వేల కేసులు అమ్ముడయ్యాయి. నగదు రూపంలో మాత్రం ఆదాయం అంతగా రాలేదు. కూటమి ప్రభుత్వం మద్యం ధరలు తగ్గించడంతో టర్నోవర్‌లో పెరుగుదల నమోదు కాలేదు. వైసీపీ హయాంలో ధర రూ.130 ఉన్న మద్యం బాటిల్ ధర ఇప్పుడు రూ.99కు విక్రయిస్తున్నారు. బీర్ రూ.30 తగ్గింది. గతంలో మాదిరిగా ధరలు ఉంటే వినియోగం పెరిగినందుకు దాదాపు రూ.110 కోట్లు ఆదాయం లభించేది. జనంపై భారం పడేది. మద్యం ధరలను తగ్గించడంతో వినియోగం పెరిగినా అమ్మకాల్లో తేడా కనిపించింది. గత ఏడాదికంటే రూ. 3 కోట్లు తక్కువ టర్నోవర్ వచ్చింది.

ఐదు రోజుల్లోనే రూ.60 కోట్లు

భీమవరం క్రైం : ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఐదు రోజుల్లోనే రూ.60 కోట్ల వరకు మద్యం తాగేశారు. భీమవరం డిపో పరిధిలోని 109 మద్యం దుకాణాలు, 15 బార్లలో లెక్కల ప్రకారం రూ.40 కోట్లు, తణుకు, తాడేపల్లిగూడెం దుకాణాల పరిధిలో చాగల్లు డిపో పరిధిలో రూ.20 కోట్ల వరకు మద్యం విక్రయాలు సాగినట్లు అధికారుల అంచనా. మొత్తం మీద జిల్లాలో రూ.60 కోట్ల మద్యం తాగేశారు.

రహదారి ప్రమాదాలను తగ్గించాలి : కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్/రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి):రహదారి ప్రమాదాలను జీరో శాతానికి తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రారం భించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల-2025 వాల్‌పోస్టర్‌ను, కరపత్రాలను, బ్యానర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు నిర్వహించే జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో వివిధ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కే.ఎస్.ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దశల వారి ప్లాస్టిక్ నిషే ధం కార్యాచరణపై జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత జిల్లాగా పునర్ నిర్మించుకోవలసిన బాధ్యత అందరిపైన ఉంద న్నారు. తొలి దశలో మొదటగా కలెక్టరేట్ నుంచే క్యారీ బ్యాగ్‌లు, టీ గ్లాసుల నిరోధానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు 'పీఎం ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు కలెక్టర్ నాగరాణి తెలిపారు. జనవరి 14 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, 21 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు టాప్-500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకా శం కల్పిస్తామన్నారు. ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి నెలకు రూ. 5 వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేల ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. వివరాలకు ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఈ, బీఎస్సీ, బీ.ఫార్మసీ, బీబీఏ డిగ్రీ ఉన్న వారెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 99888 53335, 87126 55686 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.



జనసేన కార్యకర్త కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్.. వార్త మెయిన్‌లో..

కూటమిలో విభేదాలున్నా.. కలిసికట్టుగా వెళ్లాలి

జనసేన శ్రేణులకు మంత్రి నాదెండ్ల పిలుపు



నీరు లేక బీటలు వారుతున్న వెదజల్లిన పొలం

సాగేదెలా ?

రైతుల గగ్గోలు

» పాతవయ్యేరు శివారు ప్రాంతాలకు సాగు నీటి ఎద్దడి..
» ఎండిపోతున్న నారుమడులు, వెదజల్లిన పొలాలు
» గుర్రపుడెక్క, తూడుతో పూడుకుపోయిన పాతవయ్యేరు కాలువ



పాతవయ్యేరులో పూడుకుపోయిన తూడు, గుర్రపుడెక్క



నీరు లేక అడుగంటిన తొండంకోడు కాలువ



నీరు లేక ఎండిపోతున్న నారుమడి

ఆకివీడు రూరల్ జనవరి 16(ఆంధ్రజ్యోతి): సాగు నీరందక నారుమడులు, వెదజల్లిన పొలాలు ఎండిపోతున్నాయి. ఆకివీడు మండలం సిద్ధాపురం, కళింగగూడెం, చినిమిల్లిపాడు, రాజులపేట ప్రాంతాల్లో సాగు నీరందక వరి పొలాలు బీటలు వారుతున్నాయి. ఈ ప్రాంతాలకు తాగు నీరందించే పాత వయ్యేరు కాలువలో తూడు, గుర్రపు డెక్క పేరుకుపోవడంతో సాగు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ దమ్ములు పూర్తిస్థాయిలో అవ్వలేదు. నారుమడులు ఎండిపోతున్నాయి. గత అక్టోబరులో వచ్చిన వరదల వల్ల వరి పొలాలను అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి పంటలను రక్షించుకున్నారు. దీంతో సార్వా పంట చేతికొచ్చే సమయం ఆలస్యం కావడంతో దాళ్వా సాగు మరింత ఆలస్యమైంది. తూడు తొలగించేందుకు కాంట్రాక్టర్లు రావడం లేదని అధికారులు తెలియజేస్తున్నారు. నీటిసంఘాల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని, పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. అధికారులు మాత్రం పండుగ వెళ్లే వరకు వేచి చూడాలని తెలియజేశారని, కాని పరిస్థితి అప్పటికి చేయి దాటిపోతుందని తెలిపామని వాపోతున్నారు. కాలువలో తూడు తీసి నీరు ఇచ్చే లోపల తమ నారుమడులు, వెదజల్లిన పొలాలు పూర్తిగా ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తాను అసెంబ్లీకి ఎన్నికవగానే నియోజకవర్గంలో అభివృద్ధి నిధి ఏర్పాటు చేసి పాతవయ్యేరుతోపాటు పలు కాలువల్లో తూడు తొలగించారు. తిరిగి ఆ తూడు, గుర్రపు డెక్క మళ్లీ రావడంతో వాటిని తొలగించి సాగు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

కరిగిన వేడి నీళ్ల బకెట్

మంటలు వ్యాపించి.. యువకుడి సజీవ దహనం
హీటర్ ఆన్ చేసి వదిలేయడమే కారణం.. ఏలూరులో ఘటన



ఏలూరు క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): హీటర్ ఆన్ చేసి వదిలేయడంతో వేడి నీళ్ల బకెట్ కరిగి మంటలు వ్యాపించాయి. దీంతో ఓ యువకుడు సజీవ దహనమయ్యాడు. ఈ ఘటన ఏలూరులో జరిగింది. ఏలూరు దక్షిణపు వీధిలోని పెద్దదేవుని గుడి సమీపంలో నివాసం ఉంటున్న జానా పద్మావతి సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తోంది. ఆమె తమ్ముడు గంగాధర్(30) ఇంజనీరింగ్ చదివి హైదరాబాద్‌లోని ఒక కన్సల్టెన్సీకి పనిచేస్తూ ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. అతని తాత సూర్యనారాయణ రెండేళ్ల క్రితం ఏలూరులో అనారోగ్యంతో మరణించాడు. అతని మరణ ధ్రువపత్రం తీసుకోవడానికి గంగాధర్ కాకినాడ జిల్లా అన్నవరం నుంచి గురువారం తెల్లవారుజామున ఏలూరులోని అక్క పద్మావతి వద్దకు వచ్చాడు. పండుగ సందర్భంగా స్నేహితులతో కలిసి మద్యం తాగి ఇంటికి వచ్చి మధ్యాహ్నం వరకు నిద్రించాడు. పద్మావతి బయటకు వెళ్లేటప్పుడు తలుపులకు బయట గడియపెట్టి వెళ్లింది. మధ్యలో నిద్ర లేచిన గంగాధర్ స్నానం చేయడానికి వేడి నీళ్ల కోసం ప్లాస్టిక్ బకెట్‌లో నీళ్ల పెట్టి హీటర్ ఆన్ చేసి మద్యం మత్తులో మళ్లీ నిద్రపోయాడు. బాగా మరిగిన నీళ్ల బకెట్‌లో పడుతూ అది కరిగిపోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆకస్మాత్తుగా లేచిన అతను బయటకు వెళ్లే దారిలేక ఇంట్లోనే సజీవ దహనమయ్యాడు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమా చారం ఇచ్చారు. అక్కడకు వెళ్లిన ఫైర్ సిబ్బంది చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారా యణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు.

భీమవరంలో పట్టపగలే కిడ్నాప్

భీమవరం క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి):భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద పట్టపగలే నలుగురు వ్యక్తులు రొయ్యల ఎక్స్‌పోర్టర్‌ను కిడ్నాప్ చేసిన ఘటన కలకలం రేపింది. మెంటేవారితోటకు చెందిన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ, అతని కుమారుడు సాయినాథ్‌తో కలిసి తల్లిదండ్రులను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి పంపించేందుకు గురువారం ఉదయం కారులో టౌన్ రైల్వే స్టేషన్ వద్దకు వచ్చారు. అక్కడ సత్యనారాయణ కారు వద్ద ఉండగా సాయినాథ్ నానమ్మ, తాతయ్యలను రైల్వేస్టేషన్ లోపలికి తీసుకువెళ్లి బయటకు వచ్చేసరికి సత్యనారాయణను నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి బలవంతంగా తీసుకెళ్లారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని వ్యాపారానికి సంబంధించి ఎవరైనా తీసుకువెళ్లారా లేక మరేదైనా కారణమా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ ఎస్ఐ ఇజ్రాయేల్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
★ SINCE 1965 ★
తాడేపల్లిగూడెం ● శుక్రవారం 17 జనవరి 2025

సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.






షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

అందుకే సినిమాలు తగ్గించా

బ్రహ్మానందం



'సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మ ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వీ.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.



నిజ జీవిత ఘటనల ఆధారంగా...

అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎన్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)

దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే

- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పనిచేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.



బై.. బై..

సంక్రాంతికి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మూడు రోజులు పండుగ చేసుకున్న వారంతా బై.. బై.. బాబాయ్ అంటూ గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. పండుగ మూడు రోజులూ మమ్మల్ని, మాతో పాటు వచ్చిన స్నేహితులను కూడా ఎంతగానో ఆదరించారు. నువ్వే కాదు బాబాయ్ మన గోదావరి జిల్లావాసుల ఆదరాభిమానాలకు మా మిత్రుల సంతోషం మాటల్లో చెప్పలేం. మీ అందరి ఆత్మీయత, అనురాగాలతో తిరిగి వెళుతున్నాం. మీరు మా ప్రాంతానికి రావాలి. తప్పనిసరిగా వస్తారు కదూ.. మీ రాకకై ఎదురుచూస్తూ..

పాలకొల్లు టౌన్, ఆంధ్రజ్యోతి

భారం.. కష్టం..

సంక్రాంతి అతిథుల తిరుగు ప్రయాణం.. కిటకిటలాడిన బస్సులు



ఏలూరు నగరంలోని బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

ఏలూరు/ ఏలూరు క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పెద్ద పండుగ సందడి ముగియడంతో బంధు మిత్రులంతా బరువెక్కిన హృదయంతో భారంగా తిరిగి వెళుతున్నారు. బస్సులు, రైళ్ల రద్దీతో కష్టంగా ప్రయాణిస్తున్నారు. శుక్రవారం సెంటిమెంట్‌తో గురువారం ఉదయం, మధ్యాహ్నం నుంచే ప్రయాణాలు మొదలయ్యాయి. పండుగకు ముందే స్వస్థలాలకు వచ్చిన ఉద్యోగులు సెలవులు పూర్తి కావడంతో కొంతమంది పయనమయ్యారు. మరికొందరు రెండు రోజులు సెలవులు పొడిగించుకుని శని, ఆదివారాల్లో ప్రయాణానికి సమాయత్తం అవుతున్నారు. స్వగ్రామాలకు ముందస్తు రిజర్వేషన్లతో వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో బస్సు, రైళ్లు, ప్రైవేట్ సర్వీసుల రద్దీతో ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం కొంత రద్దీ తగ్గినా శని, ఆదివారాల్లో రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

కిటకిటలాడిన బస్ స్టేషన్లు

బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు గురువారం సాయంత్రం నుంచి కిటకిటలాడాయి. ఎవరిని చూసినా నాలుగేసి బ్యాగ్‌లతో ఉన్నారు. వచ్చినప్పుడు రెండు బ్యాగ్‌లు ఉండగా వెళ్లేటప్పుడు మరో రెండు బ్యాగ్‌లు తోడయ్యాయి. బంధువులు ఇచ్చిన పిండివంటలు తమ పొలంలో పండిన పంటలు, పండ్లను తీసుకుని వెళ్లారు. ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ పవర్ పేట, ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్, నూజివీడు రైల్వే స్టేషన్, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, జీలుగుమిల్లి, చింతలపూడి, నూజివీడు, గుండుగొలను సెంటర్, భీమడోలు, కైకలూరు బస్టాండ్లు కిటకిటలాడాయి. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా తమ ప్రయాణాన్ని కొనసాగించడంతో బస్సులు అన్నీ నిండిపోయాయి. రైళ్లు కూడా రద్దీగానే ఉన్నాయి. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు గుట్టు చప్పుడు కాకుండా అధిక ధరలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఎక్కించుకుని తీసుకువెళ్తున్నారు. ముందుగానే టిక్కెట్లు లేవంటూ చెప్పి బస్సు వస్తే ఖాళీ ఉంటే ఎక్కిస్తామంటూ ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. ఆ విధంగా అయినా డబ్బులు తీసుకుని గురువారం రాత్రి జిల్లాలో ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు యథేచ్ఛగా ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. దీంతో వారంతా దిక్కుతోచని పరిస్థితిలో ప్రయాణాన్ని కొనసాగించుకోవాల్సి వచ్చింది.

బోసిపోయిన గ్రామాలు

ఏలూరు రూరల్, చింతలపూడి, కామవరపుకోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు వచ్చిన బంధుమిత్రులు కొత్త అల్లుళ్లతో వారం రోజులుగా పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఈసారి ప్రతి ఇంటికి బంధువులే కాదు ఎవరో ఒకరు అతిథులుగా రావడంతో ఆనందోత్సాహాల మధ్య గడిపారు. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు సందడిగా మారాయి. వచ్చిన వారంతా తెలిసిన ప్రతి ఒక్కరిని పలుకరించి యోగక్షేమాలు తెలుసుకుని ఆప్యాయతలను కురిపించారు. వారం రోజుల పాటు ఎంతో సందడిగా కనిపించిన వాతావరణం గురువారం ఒక్కసారిగా బోసిపోయింది. బంధువులు, మిత్రులు పెద్దసంఖ్యలో వాహనాలపై రావడంతో గ్రామాల్లో అధిక సంఖ్యలో కార్లు కనిపించాయి. పోలవరం బస్ షెల్టర్ వద్ద తిరుగు ప్రయాణమైన బంధువులు సాగనంపుతున్న గ్రామస్తులతో హృదయాలు భారంగా కాగా కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సులు భారంగా కదిలాయి. కామవరపుకోట ప్రాంతానికి సంక్రాంతి సందర్భంగా ఇతర దేశాలు, రాష్ట్రాలు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు తిరిగి పయనమయ్యారు. లండన్, హైదరాబాద్, ముంబై, బెంగళూరు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారంతా బంధుమిత్రులతో ఆహ్లాదంగా గడిపి బరువెక్కిన హృదయాలతో తిరిగి వెళ్లారు.

చింతలపూడి రావడం నరకమే



నా కుమారుడు బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. బెంగళూరు నుంచి ఏలూరు ఏలూరు వచ్చిన తరువాత చింతలపూడి చేరుకోవడం కష్టమే. లగేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో మాదిరిగా చింతలపూడి నుంచి సర్వీసులు నడవడంలేదు. నడిచే సర్వీసులు ఎక్కడ నిలిచిపోతాయో తెలియదు. అధికారులు దృష్టి సారించి పరిష్కారం చేయాలి.

పొట్టి వెంకటేశ్వరరావు, చింతలపూడి

దూర ప్రయాణం కష్టం



మాది చింతలపూడి మండలం నామవరం. దూర ప్రాంతాలకు వెళ్లి రావాలంటే ఏలూరు లేదా సత్తుపల్లి వెళ్లాల్సిందే. తర్వాత చింతలపూడి అక్కడి నుంచి మా గ్రామానికి చేరుకోవాలి. ఇది నా ఒక్కడి సమస్య కాదు. గ్రామీణ ప్రాంతాల నుంచి అనేక మంది హైదరాబాద్‌లో చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తున్నారు. పనిమీద రావాలన్నా, వెళ్లాలన్నా ప్రయాణం నరకమే. చింతలపూడి వచ్చి మండలం లోపల ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే ఇంకా నరకమే. ఏ సర్వీసులు ఉండవు, ఆటోలు ఉండవు. ఇంకా అడవిలో ఉన్నామా అన్నట్టు ఉంటుంది. చింతలపూడి ప్రయాణమంటేనే భారంగా ఉంది. ఇప్పటికైనా మార్పులు తీసుకురావాలని కోరుతున్నారు.

ఇ.అశోక్‌కుమార్, నామవరం

టికెట్ ధర రెట్టింపు..!

ఆచంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వచ్చిన తిరుగు ప్రయాణంలో హృదయంతో పాటు జేబుకు కూడా భారమే. హైదరాబాద్ వెళ్లేందుకు రైలు, ప్రైవేటు ట్రావెల్స్ టికెట్లు అందుబాటులో లేవు. ఎంతైనా ఇస్తాం.. టిక్కెట్లు కావాలంటూ కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌కు ఎగబడ్డారు. దీనితో ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధర ఒక్కసారిగా రెట్టింపైంది. హైదరాబాద్ టిక్కెట్ ధర రూ.వెయ్యి కాగా ఒకేసారి రూ.2 వేలకు పెంచినా దొరకని పరిస్థితి నెలకొంది. రెండు రోజులు పాటు టిక్కెట్‌ల డిమాండ్ ఇలాగే ఉంటుందని పలువురు చెబుతున్నారు.

హరిదాసు.. జంగమ దేవరల వీడ్కోలు





గణపవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏటా సంక్రాంతికి దర్శనమిచ్చే హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులవారు జంగమదేవర్లు, పిట్టలదొరలు, బృందాలు పండుగ ముగియడంతో స్వగ్రామాలకు బయల్దేరుతున్నారు. గ్రామాల్లో సంక్రాంతి ముగిసేవరకు పర్యటిస్తూ సంక్రాంతి కళను తీసుకొస్తుంటారు. సంక్రాంతి పండుగ ముగియడంతో ఇంటింటికి వెళ్లి బియ్యం, నగదు, బహుమతులు అందుకున్నారు. స్వగ్రామాలకు తీసుకెళ్లి అక్కడ చిరువ్యాపారాలు, కూలిపనులు కూడా చేసుకుంటామని తిరిగి సంక్రాంతి నెల ప్రారంభంలో ఇక్కడికి వస్తామన్నారు. తాతల నాటి సాంప్రదాయాలు కాపాడటమే తమ ధ్యేయమని ఎన్‌టీఆర్‌జిల్లా జగ్గయ్యపేటకు చెందిన దాసరి మల్లేష్ హరిదాసు తెలిపారు.



మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్

డాక్టర్ రాజ్యలక్ష్మి

మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ (క్లాసిక్ విభాగం) కిరీటం నూజివీడుకు చెందిన దంత వైద్యురాలు వై.రాజ్యలక్ష్మి సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 12న ఆమె టైటిల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మితో ఆంధ్రజ్యోతి ముఖాముఖి.

● టైటిల్ గెలుచుకోవడం..?

మహిళలు ముందడుగు వేస్తూ ప్రతి రంగంలో విజయం సాధించినప్పుడే సమాజం ముందుకు వెళుతుంది. మహిళా సాధికారికత దిశగా పయనించాలి.

● సమాజ శ్రేయస్సుకు చేసే కృషి..

సమాజాభివృద్ధికి సనాతన ధర్మం దోహద పడుతుంది. సనాతన ధర్మాన్ని కాపాడినపుడే ఉమెన్ ఎంపవర్‌మెంట్ సాధ్యం. దీన్ని మెయిన్ థీమ్‌గా తీసుకుని మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ క్లాసిక్ విభాగంలో విజేతగా ఎంపిక కాగలిగాను.

● వైద్యురాలిగా.. అందాల పోటీలు.. ఎలా సమన్వయం చేయగలిగారు?

మహిళ కుమార్తెగా, చెల్లిగా, అక్కగా, భార్య, మాతృమూర్తిగా తన పాత్రను సమర్ధవంతంగా పోషిస్తుంది. ఆరోగ్యకర సమాజాన్ని ఏర్పరచడంలో మహిళ పాత్ర కీలకం. సీతాదేవిని ప్రేరణగా తీసుకుని అన్నిరంగాల్లో ఎన్ని కష్టాలు వచ్చినా ముందుకు సాగాలనే ఆలోచనే అటు వైద్యురాలిగా, ఇటు మోడల్‌గా విజయం సాధించేందుకు అవకాశం కలిగించింది.

● మున్ముందు మహిళాభివృద్ధి..?

మనది పూర్వం మాతృస్వామ్య సమాజం. ఇప్పుడు కూడా విద్య, వ్యాపారం, ఇతర రంగాల్లో దాదాపు సగభాగం మహిళల పాత్ర ఉంది. మిగిలిన రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది.

(నూజివీడు, ఆంధ్రజ్యోతి)



ద్వారకాతిరుమల ఆలయ తూర్పు రాజగోపురం వద్ద భక్తుల సందడి

గోవిందా.. గోవిందా..

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

హోరెత్తిన గోవింద నామ స్మరణ

ద్వారకాతిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలు ముగియడంతో గురువారం వేలాదిగా భక్తులు చినవెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ద్వారకాతిరుమల ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దాదాపు 15వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాల సమాచారం. స్వామివారి దివ్య మూర్తులను దర్శించి భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతర స్వామివారి ఉచిత ప్రసాదాలను, అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామివారి ఉచిత దర్శనానికి గంటల వరకూ సమయం పట్టింది.

కనుల పండువగా అధ్యయనోత్సవాలు

శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ముక్కోటి పర్వదినం మొదలుగా పది రోజులు ఉత్సవాలను జరపడం సంప్రదాయం. గురువారం సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారిని తొళక్క వాహనంపై ఉంచి నిత్య కల్యాణ మండప ఆవరణలోకి తెచ్చారు. మండపంలో వేదికపై బంగారు సింహాసనంపై ఉత్సవ మూర్తులను ఉంచి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం నవ కలశస్నపన, అభిషేకాలను నిర్వహించారు. ఆ తరువాత తిరుమంజనాలు జరిపి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు సేవా కాలాన్ని జరిపి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. అనంతరం శ్రీవారి తిరువీధి సేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.



బంగారు సింహాసనంపై స్వామి, అమ్మవార్లు

ఉత్కంఠభరితంగా కబడ్డీ పోటీలు

పురుషుల విభాగంలో దూసుకుపోతున్న సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, జమ్ముకాశ్మీర్, ఆంధ్ర జట్లు

మహిళా విభాగంలో ఆంధ్రా, ఢిల్లీ, పాటియాల జట్లు



కోల్‌కత్తా – ఢిల్లీ జట్ల మధ్య పోటీ

నరసాపురం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాదా కబడ్డీ స్టేడియంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు గురువారం మూడో రోజు ఉత్కంఠభరింతంగా జరిగాయి. లీగ్ కంనాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈపోటీలకు పురుషుల విభాగంలో 19, మహిళల్లో 18 రాష్ట్రాల జట్లు తలపడుతున్నాయి. శుక్రవారం సెమీ ఫైనల్స్‌కు చేరనున్నాయి.

ఇప్పటి వరకు జరిగిన పోటీల్లో పురుషల విభాగంలో ఢిల్లీ సీఆర్‌పీఎఫ్, జమ్ము కాశ్మీర్, ఆంధ్రా, కొల్‌కత్తా పోలీస్ జట్లు ముందంజలో ఉన్నాయి. మహిళా విభాగంలో ఆంధ్రా, సీఆర్‌పీఎఫ్ ఢిల్లీ, పాటియాల జట్లు దూసుకుపోతున్నాయి. అన్ని జట్లలో జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండడంతో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్‌కు ఏ జట్లు చేరతాయనేది ఉత్కఠభరితంగా మారింది. పోటీలు తిలకించేందుకు ఉభయగోదావరి జిల్లాల నుంచి క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కబడ్డీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ఆంధ్రా జట్లు తలపడుతున్నప్పుడల్లా అభిమానులు కేకలతో ఉత్సాహపరిచారు. గురువారం పురుషల విభాగంలో జరిగిన పోటీలో సీఆర్‌పీఎఫ్ భువనేశ్వర్‌ను 37 పాయింట్లు, కోల్‌కత్తా పోలీస్ జట్టును కేరళ పోలీస్‌ల మధ్య జరిగిన పోటీలో కోల్‌కత్తా 29 పాయింట్లు, యూపీ - కేరళ మధ్య జరిగిన పోటీలో యూపీ 21 పాయింట్లతో విజయం సాధించాయి. మహిళా విభాగంలో భువనేశ్వర్ జట్టును కేరళ 33, పాటియాల జట్టును రాజస్తాన్ 20, ఫరీదాబాద్ జట్లు భువనేశ్వర్‌పై 23 పాయింట్లతో, ఆంధ్రా ఫరిదాబాద్ జరిగిన హోరాహోరి పోటీలో ఆంధ్రా 9 పాయింట్లతో విజయం సాధించింది. ఈ పోటీలను మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కన్వీనర్ జానకిరామ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సీఈవో వీరలంకయ్య, దొండపాటి స్వామి, ప్రసాద్ తిలకించారు.



మధ్యప్రదేశ్ గవర్నర్ నుంచి అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయులు

కైకరం విద్యార్థినికి

జాతీయ పురస్కారం

ఉంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఉంగుటూరు విద్యార్థిని అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 6 వరకు భోపాల్‌లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఢిల్లీ పబ్లిక్ స్కూలు, ఏలూరు జిల్లా కైకరం హైస్కూలు నుంచి తాడి చెట్ల పెంపకం- భవిష్యత్ నూతన వ్యవసాయ విధానం ప్రాజెక్టును ప్రదర్శించిన నెర్సు కుసుమ లత, పొడుగు రామ్ చరణ్ అవార్డుకు ఎంపికయ్యారు. వారి ప్రాజెక్ట్ ఎంపిక కావడంతో రాష్ట్రం తరఫున గైడ్‌లు రామకృష్ణ, సారధి మధ్య ప్రదేశ్ గవర్నర్ మంగూభాయి సి.పటేల్ నుంచి అవార్డు అందుకున్నారని పాఠశాల హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు గురువారం తెలిపారు. కైకరం హైస్కూలు నుంచి ఫిజిక్స్ టీచర్ జాన్ గైడ్‌గా వ్యవహరించారు.

పేదింటి బిడ్డ కుసుమలత



ఏలూరు మండలం పోణంగి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నెరుసు శ్రీనివాస రావు, లక్ష్మి దంపతుల కుమార్తె కుసుమ లత. అమ్మమ్మ ఊరైన ఎ.గోకవరంలో ఉంటూ కైకరం హైస్కూలులో చదువుతోంది. ప్రస్తుతం కుసుమలత పాలిటెక్నిక్ ప్రధమ సంవత్సరం చదువుతోంది. హైస్కూలు హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ అల్లూరి జగన్మోహిని, సభ్యులు అభినందించారు.



ప్రవచనం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ, పాల్గొన్న భక్తులు

సంప్రదాయాలను పాటించండి

గణపతి సచ్చిదానంద స్వామీజీ

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సంప్రదాయాలను పాటించాలని, సంప్రదాయంగా కనిపించాలని, భగవద్గీతను చదవాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. భీమవరం అష్టలక్ష్మీ దేవాలయంలో గురువారం గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీదత్త విజయానంద తీర్థ స్వామిజీ శ్రీకార్యసిద్ధి హనుమత్ ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ మనుషులు, దేవతలకు అహంకారం తీసేది ఈశ్వరుడని, భవిష్యత్ బ్రహ్మ అని అన్నారు. అందరూ భక్తి భావాన్ని పెంచుకోవాలని సూచించారు. మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని, సమస్త భక్తులను కాపాడే అవతారమే శివుడు, దత్తాత్రేయ అవతారమే నేడు కనిపిస్తున్న హనుమంతుడని అన్నారు. మన శరీరంతో మనం వెళ్లలేమని, ఎప్పుడో ఒకప్పుడు శరీరాన్ని వదిలేయవలసిందేనని స్వామీజీ అన్నారు. భగవన్నామస్మరణ ఒక్కటే భక్తి, ముక్తి మోక్షానికి మార్గమని వివరించారు.







మావుళ్లమ్మ ఉత్సవాల్లో అలరించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు

వైభవంగా మావుళ్లమ్మ ఉత్సవాలు

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి దర్శనార్థం గురువారం భక్తులు క్యూ కట్టారు. ఉదయం నుంచి భక్తుల తాకిడి కనిపించింది. సాయంత్రం 6 గంటల తరువాత ఇతర ప్రాంతాల భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. రాత్రి వేళ ఆలయ కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు చేసిన ప్రత్యేక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాంతారా, కాంచన వంటి నృత్యాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సంకీర్తనలు, సాయంత్రం 4 గంటలకు పిప్పళ్ళ ప్రసాద్ ఆధ్యాత్మిక సంకీర్తన, రాత్రి 9 గంటలకు విజయదుర్గా నాట్యమండలి మాయాబజార్ నాటకం ప్రదర్శించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు





కబడ్డీ పోటీలో హోరాహోరీ తలపడుతున్న తణుకు– జంగారెడ్డిగూడెం మహిళల జట్లు



ఆరవల్లిలో పోటీలు ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

రేపు యోగి వేమన జయంత్యుత్సవం

ఆరవల్లిలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

అత్తిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన శత జయంతి ఉత్సవాల్లో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లిలో గురువారం నుంచి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 18న వేమన జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి స్త్రీల కబడ్డీ టోర్నమెంట్‌ను గ్రామ ప్రముఖులు గొలుగూరి వెంకటరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ వెలగల సుస్మితరెడ్డి, ఎంపీటీసీ దొమ్మేటి రమ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా నుంచి ఆరు జట్లు పోటీలలో పాల్గొన్నాయి. తణుకు- జంగారెడ్డిగూడెం మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో జంగారెడ్డిగూడెం జట్టు విజయం సాధించింది. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను రిటైర్డు డ్రిల్ మాస్టర్ వెలగల రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. జిల్లా కబడ్డీ సెక్రటరీ వై.శ్రీకాంత్, కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సత్తివెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపునకు 17వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి రోడ్, ఆరేటి నగర్, రాజీవ్ నగర్ కాలనీ, సీతారాం నగర్, దుర్గాపురం, కొవ్వాడ బైపాస్ రోడ్, డీమార్ట్, బివి రాజు బొమ్మ, లంకపేట, నరసింహపురం గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

19న కోట్లమ్మ జాతర

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు కోట్లమ్మ జాతర వేడుకలు ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గురువారం భజనలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షిస్తోంది.

నేటి నుంచి మాతాజీ ప్రవచనాలు

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : భీమవరం త్యాగరాజ భవనంలో భక్త సమాజ్, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ తెలిపింది. 17న ప్రవచనాలు, 18న శ్రీత్యాగరాజ స్వామి సంకీర్తనలు, మాతాజీ అనుగ్రహ భాషణం, 19న లలిత సహస్ర నామ కుంకుమ పూజలు, పాదపూజ, భక్త ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహ కులు తుమ్మలపల్లి శివ, ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, చెరుకువాడ సోదరులు తెలిపారు.

రిటైర్డ్ ఎస్ఐ రంగనాయకులు మృతి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం మిలిటరీ మాధవరానికి చెందిన రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జడ్డు రంగనాయకులు (72) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన జిల్లాలో పలు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా, ఏఎస్సైగా పనిచేశారు. ఆయన కుమారుడు హరిబాబు వైసీపీ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడిగా ఉన్నారు. మాధవరం మాజీ సైనికోద్యోగుల సంఘ అధ్యక్షుడు బొల్లం వీరయ్య, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి రఘురాంనాయుడు, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు రంగనాయకులు మృతికి సంతాపం తెలిపారు.

రేషన్ డీలరు పెద్దింటి మృతికి సంతాపం

ఉండి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉండి ఇసుకదొడ్డి ప్రాంతానికి చెందిన రేషన్ డీలరు, టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దింటి రామారావు బుధవారం రాత్రి మృతి చెందారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా, ఉండి రూరల్ బ్యాంక్ డైరెక్టరుగా, ఉండి పంచాయతీ సభ్యుడుగా పనిచేశారు. రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు చెన్నంశెట్టి బాబి, కొమ్మన నాగబాబు, పలువురు డీలర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, ఎంపీటీసీ కునుకు రమాదేవిశ్రీను సంతాపం తెలిపారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న వంక

తణుకు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని జాతీయ స్థాయి వర్కుషాపులో పాల్గొని వివిధ అంశాలపై చర్చించినట్లు ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బడ్జెట్‌లో ఎలాంటి ప్రభావాలు చూపిస్తున్నాయనే అంశంపై చర్చించినట్లు చెప్పారు.

కార్గో విజేతలకు బహుమతుల పంపిణీ

తణుకు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసి కార్గో కొరియర్, పార్సిల్ డోర్ డెలివరీ లక్కీ డిప్ విజేతలకు గురువారం తహసీల్దార్ అశోక్ వర్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్ అందజేశారు. మూడో వారం లక్కీ డిప్ విజేతలకు బహుమతులు అందించారు. డీఎం గిరిధర్‌కుమార్, షేక్ లాల్ పాల్గొన్నారు.



క్రీస్తు బోధనలు అనుసరణీయం : మోషేన్

వీరవాసరం/భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అనుసరణీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు అన్నారు. వీరవాసరం మండలం తలతాడితిప్ప గ్రామంలో గురువారం లూథరన్ చర్చి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైసీపీ నరసాపురం ఇన్‌చార్జి గుడాల గోపి, పాస్టర్లు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత

యలమంచిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో వడ్డిలంక గ్రామానికి చెందిన కామన మారియ్య తాటాకిల్లు దగ్ధమవడంతో ప్రభుత్వ ఆర్థికసాయం రూ. 5 వేలు, 25 కేజీల బియ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సమ కూర్చిన రగ్గులు, టార్పా లిన్లు, వంట సామగ్రిని తహసీల్దారు జి.పవన్ కుమార్, సర్పంచ్ అడబాల చిట్టిబాబు, ఎన్డీఏ నాయకుల చేతులమీదుగా మారియ్యకు అందజేశారు. ఎన్డీఏ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, కడలి గోపి, పీతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పంటు కిటకిట

మాధవాయిపాలెం రేవుకు తగ్గని పండుగ రద్దీ



గోదావరిలో ప్రయాణీకులతో పంట్లు

నరసాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవుకు పండుగ రద్దీ తగ్గలేదు. గోదావరి దాటి అంతర్వేది వెళ్లేందుకు గురువారం పట్టణంలోని స్టీమర్ రోడ్డులో కార్లు బారులు తీరాయి. పాలుకొల్లు రోడ్డులోని దిగమర్రు మీదుగా రోడ్డు మార్గం ఉన్నా చాలామంది వాహనదారులు పంటుపై గోదావరి దాటి వెళ్లేందుకే మక్కువ చూపారు. తెలంగాణ, విజయవాడ, గుంటూరు మీద వచ్చే వాహనదారులు అంతర్వేది వెళ్లాలంటే గూగుల్ మ్యాప్‌లో నరసాపురం మీదుగానే చూపిస్తుంది. దీంతో చించినాడ మార్గం తెలియని చాలా మంది రేవు దాటి అంతర్వేది వెళ్లారు. ఇటు రద్దీకి అనుగుణంగా పాటదారులు కూడా మూడు పంటులను తిప్పారు. పండుగ కారణంగా ఈ నెల 11 నుంచి ఇదే రద్దీ కొనసాగింది. ఆదివారం వరకు సెలవులు కలిసి రావడంతో చాలా మంది కుటుంబ సభ్యులతో కలసి గోదావరి జిల్లాల్లో ఎంజాయ్ చేసేందుకు తరలివస్తున్నారు. ఈ కారణంగానే ఇంకా రోడ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్‌ల్లో పండుగ సందడి కనిపిస్తోంది.



అల్లుడికి 250 వంటకాలతో వడ్డన!

గణపవరం: మొయ్యేరు గ్రామానికి చెందిన బలుసు శ్రీనివాసరావు దంపతులు తమ అల్లుడు డాక్టర్ శివకుమార్‌కు 250 రకాల వంటకాలను వడ్డించారు. దీంతో ఆ మర్యాదలు చూసి అల్లుడు పొంగిపోయాడు.



చింతపర్రులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

నరక రోడ్ల నుంచి విముక్తి : మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రహదారులు ఘోరమని ప్రజలు గగ్గోలు పెట్టేవారని, ఆ పరిస్థితిని రూపు మాపడానికి ఎన్డీయే ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు రూరల్ మండలంలోని వడ్లవాని పాలెం, చింతపర్రు, వెలివెల గ్రామాల్లో రూ.3.30కోట్లతో రహదారులు నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. మంత్రి స్వయంగా బైక్‌ను నడుపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ కార్యక్రమాలకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, జడ్పీటీసీ గోవిందరాజులు నాయుడు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, సర్పంచులు పెన్మెత్స పద్మ, గుమ్మాపు పెద్దిరాజు, కందుల వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్ సాగా సత్యనారాయణ, ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఇవోఆర్డీ టి.మూర్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీనివాస్ దంపతులకు కమిటీ సభ్యుల సత్కారం

సన్మార్గంలో నడవాలి : మంత్రి కొండపల్లి

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన సత్యం, ధర్మంతో గడపడం మానవ జన్మ సార్థకత కు మార్గ దర్శకాలని రాష్ట్ర ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని మంత్రి శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించి ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదన్ రావు, కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు. అనంతరం గునుపూడిలోని సోమేశ్వరస్వామిని మంత్రి దర్శించుకోగా ఆలయ అర్చకులు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించి దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు.

కొండేటికి సత్కారం



నరసాపురం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల్లో రోడ్లు, వంతెనలు, విద్య, మంచినీటి సమస్యల పరిష్కారానికి మాజీ ఎంపీపీ కొండేటి రామకృష్ణరావు కృషి ఎనలేనిదని వక్తలు కొనియాడారు. కొండేటి 52 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని శుక్రవారం యూత్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అతిథిగా విచ్చేసిన విప్ నాయకర్ మాట్లాడుతూ కొండేటి విలువలతో కూడిన రాజకీయాన్ని చేశారని, ఆయన చేసిన అభివృద్ధిని గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న ప్రసంగించారు. అనంతరం కొండేటి దంపతుల్ని గజమాలతో సత్కరించారు. ఎంపీపీ సోని, సర్పంచ్ ఏసు, వైఎస్ బాబులు, కొండేటి శ్రీను, ముదునూరి మార్రాజు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అపూర్వ సమ్మేళనం

తణుకు రూరల్, జరవరి 16 (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం వేల్పూరు జడ్పీ హైస్కూల్‌లో 1976-77 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన తెలుగు ఉపాధ్యాయుడు సత్యమూర్తిని సత్కరించారు. హెచ్ఎం కే. మునీంద్ర రావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్ధాంతంలో..

పెనుగొండ: సిద్ధాంతం హైస్కూలులో 1998-99లో చదివిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గురువారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దేశ విదేశాలలో స్థిరపడిన వారంతా కలుసుకుని నాటి సంగతులు జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థులైన సర్పంచ్ సీహెచ్ గనిరాజు, సీనియర్ పాత్రికేయుడు హనుమంతు, పోతురాజు, చిట్టూరి నాగరాజు, ప్రదీప్, సరెళ్ళ సురేష్ పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు పెద్దపీట : బొలిశెట్టి



ఆలయానికి విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్/అర్బన్/ పెంట పాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కోసం పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కృష్ణాయపాలెంలో ఇండస్ట్రియల్ క్యారిడార్‌లో భాగంగా 24 గంటల విద్యుత్ లైన్‌ను గురు వారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ నేటి యువత పదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముందు సాగాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర రావు, మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, ఏఈ రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. కడియద్దలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి గురువారం ఎమ్మెల్యే బొలిశెట్టి రూ. 16 వేలు విరాళాన్ని అందజేశారు. వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పరిమి రవికుమార్, మద్దిపాటి సత్యనారాయణ, వట్టి నాగమాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుం దని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. గురువారం తన కార్యాలయంలో లబ్ధిదారులు నలుగురికి రూ. 4.80 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ సక్రమంగా జరపాలి : ఆరిమిల్లి



చెత్త సేకరణ బండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి వెళ్ళి చెత్త సేకరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య బండ్లను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వార్డులో చెత్త సేకరణకు మున్సిపాల్టీ ద్వారా 35 పుష్ కార్ట్స్‌ను అందించామన్నారు. రూ. 2 లక్షలతో కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెడుగుడు పోటీల విజేత భీమవరం



ట్రోఫీ అందుకుంటున్న భీమవరం జట్టు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెంలో సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల్లో భీమవరానికి చెందిన తన్వీ కోహ్లి జట్టు విజేతగా నిలిచింది. తన్వీ కోహ్లి, ఉప్పరగూడెం ఎన్వీఆర్ జట్ల మధ్య జరిగిన నువ్వానునా అన్నట్టుగా జరిగిన పోటీల్లో భీమవరం జట్టు విజేతగా నిలిచి రూ.40 వేల నగదు బహుమతి సాధించింది. విజేతకు వైసీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాం నాయుడు, టీడీపీ జిల్లా నాయకుడు వాడపల్లి వెంకట సుబ్బరాజు, జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్ ట్రోఫీని అందించారు. రన్నరప్‌గా నిలిచిన ఉప్పరగూడెం జట్టుకు రూ.35 వేలు నగదు, మూడో బహుమతిని వెంకట్రావుపాలెం జట్టుకు రూ.30 వేలు అందించారు. పోటీలను గ్రామానికి చెందిన అంబేడ్కర్ కమిటీ, జైభీమ్ యూత్ నాయకత్వంలో నిర్వహించారు.



వాలీబాల్ విజేత తాడినాడ-ఎ జట్టుకు షీల్డ్ ఇస్తున్న ఏఎస్పీ భీమారావు, ఎమ్మెల్సీ గోపిమూర్తి

క్రీడా స్ఫూర్తిని చాటాలి

ఆకివీడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటి స్నేహభావం పెంపొందించుకోవాలని అదనపు ఎస్పీ భీమారావు, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ గోపిమూర్తి అన్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల వాలీ బాల్ పోటీలో తాడినాడ-ఏ జట్టుకు ప్రథమ బహుమతిని అందచేసి మాట్లాడారు. డీవైఎఫ్ఐ 42 ఏళ్లుగా సంక్రాంతి యువజనోత్సవాలు నిర్వహించడం గర్వకారణమన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, కార్యదర్శి జి.రామన్న, ఆహ్వాన సంఘం కార్యదర్శి గేదెల ధనుష్, కోశాధికారి బొడ్డుపల్లి రాంబాబు, అధ్యక్షులు ఎండీ మదనీ, నిర్వహణ కమిటీ కన్వీనర్ డోకల రవితేజ, సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు బొక్కా సత్యనారాయణ, వర్మ, పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, సీఐటీయూ మండల అధ్యక్షులు పెంకి అప్పారావు, సందక సూరిబాబు తదితరులు ఉన్నారు.



హాకీ జిల్లా జట్టు ఎంపిక

భీమవరం టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో పాల్గొనేందుకు పశ్చిమ గోదావరి జిల్లా జట్టును గురువారం ఎంపిక చేశారు. మదనపల్లిలో 17 నుంచి 19 వరకు జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా తరఫున ఆడనున్నారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి ఆనందరాజు, జయింట్ సెక్రటరీ పి. నాగబాబు, సెయింట్ మేరీస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, కోచ్ బెంజాక్, మేనేజర్ వై దుర్గా రెడ్డి, తదితరులు ఎంపికైన జట్టును అభినందించారు.



గరగాలమ్మకు ఎమ్మెల్యే పితాని పూజలు

ఘనంగా జాతరలు

పెనుగొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతంలో బుధవారం రాత్రి గరగాలమ్మ జాతర శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి అమ్మవారికి పూజలు చేశారు. సర్పంచ్ చింతపల్లి గనిరాజు, గరగాలమ్మ శెట్టిబలిజ సంఘం పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలో వనువులమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. పోలీసులు కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎల్‌బీ చర్లలో గంగాలమ్మ జాతర ఘనంగా జరిగింది.

ఉండి: పాములపర్రులోని పాశాలమ్మ జాతర ఘనంగా జరిగింది. డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు విచ్చేశారు. అమ్మవార్లను దర్శించుకున్నారు. సర్పంచ్ కేశన శాంతకుమారి బలుసులరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీపైళ్లమ్మ పైడమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ ముదునూరి సోమరాజు, దర్శకుడు రాజా వన్నెంరెడ్డి, అల్లూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు: చింతపల్లివారి తోటలో గల గోగులమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. అసాదుల నృత్య ప్రదర్శనలు, బాణా సంచా కాలుస్తూ తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారిని గ్రామ పొలిమేరకు సాగనంపారు. మొగల్తూరు రామాలయం వీధిలోని శ్రీదత్త సాయి మందిరంలో గురువారం గ్రామానికి చెందిన అనంతపల్లి రంగ రామేశ్వర్ మనుమరాలు నంబూరు వేణుఖ్య వర్ధిని అన్నసమారాధన నిర్వహించారు.

పోడూరు: పోడూరు గ్రామ ఇలవేల్పు వెలగలమ్మ జాతర గురువారం ఘనంగా జరిగింది. అమ్మవార్ల ఘటాలతో అసాదుల నృత్యప్రదర్శనలు, బుట్టబొమ్మలు, కోయ డాన్సులు, తీన్‌మార్ డప్పులు, కాళికాదేవి వేషాధారణ, బాణాసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



గంగాలమ్మ

పెంటపాడు: ఉమామహేశ్వరంలో పెంట్లమ్మ జాతర ముగిసింది. అమ్మవారికి గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించారు. ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ రమేష్, పెంటపాడు ఎస్ఐ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి గ్రామ పెద్ద రాయుడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. సర్పంచ్ మద్దుకూరి నాగేశ్వరరావు, మద్దుకూరి రామకృష్ణ, కొండ్రెడ్డి హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి



అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారిణి

- **ఫిల్టర్ బెడ్ ల మరమ్మతులపై చర్యలు ఏమిటి?**

  జవాబు: 15వ ఆర్థిక సంఘం నిధులతో 927 పనులు చేపట్టాం. అందులో మంచినీటి ఫిల్టర్ బెడ్ మరమ్మతులు ప్రదానంగా చేయిస్తున్నాం.
- **కుళాయి పన్నుల వసూళ్లు ఎలా ఉన్నాయి?**

  జవాబు: నూరు శాతం వసూళ్ళు లక్ష్యం. అన్ని పంచాయతీల అధికారులతో మాట్లాడుతున్నాం.
- **వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలేమిటి?**

  జవాబు: ముందుగానే చెరువులు నింపి ఇబ్బందులు లేకుండా చేస్తాం.
- **ఓహెచ్ఎస్ఆర్‌లో క్లోరినేషన్ జరుగుతోందా?**

  జవాబు: రోజువారీ క్లోరినేషన్ జరుగుతోంది. 15 రోజులకు ఒకసారి ఓహెచ్ఎస్ఆర్‌లు శుభ్రం చేయిస్తున్నాం.

(ఆంధ్రజ్యోతి-భీమవరం రూరల్)

రైతులను ఆదుకోవాలి

ఇరగవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రైతులకు బోనస్ ప్రకటించాలని సీపీఎం, రైతు సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మండలంలోని కొత్తపాడులో గురువారం కౌలు రైతులు, సీపీఎం ఆధ్వర్యంలో బోనస్ ప్రకటించాలని ఆందోళన చేశారు. సీపీఎం నాయకులు కామన మునిస్వామి, నాగబాబు, పిల్లి కోటేశ్వరరావు, తాళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సినేషన్

పెనుగొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వడలిలో కుక్కలకు వ్యాక్సినేషన్ కా చేపట్టారు. పలువురిని కుక్కలు కరవడంతో పంచాయతీకి ఫిర్యాదులు రావడంతో కుక్కకాటు వల్ల సంభవించే వ్యాధులు ప్రబలకుండా పెనుగొండ మండల పశువైద్యులతో సుమారు 90 కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేసినట్లు కార్యదర్శి కొప్పూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడి మృతి

పెంటపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి పెంటపాడులో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం పెంటపాడు గ్రామానికి చెందిన దారం గంగాధర్‌రావు(43) కూలిపని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి చెవుడు, మూగ. బుధవారం రాత్రి 1.30 సమయానికి పని నిమిత్తం తాడేపల్లిగూడెం వెళ్తుండగా భీమవరం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఇతన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడికి రూ. 10 వేల జరిమానా

ఇరగవరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తికి రూ. 10 వేల జరిమానా విధించినట్లు సీఐ మణికంఠ రెడ్డి తెలిపారు. కత్తవపాడులో అనధికారికంగా మద్యం విక్రయిస్తూ గతంలో పట్టుబడిన మురాల చిన్ని (54) అనే వ్యక్తిని ఇరగవరం తహసీల్దార్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా రూ. పది వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా బెల్ట్ షాపులకు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ మణికంఠరెడ్డి తెలిపారు.

మహిళపై దాడి

భీమవరం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేయడమే కాక చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. యర్రంశెట్టి వారి వీధికి చెందిన వెండి లక్ష్మి వద్దకు పీడ శ్రీనివాస్ అనే వ్యక్తి కొద్ది నెలల క్రితం వచ్చి తనకు భోజనానికి ఇబ్బందిగా ఉందని, వండిపెడితే డబ్బులిచ్చేస్తానని చెప్పడంతో తెలిసిన వ్యక్తే కదా అని ఆమె సరేనంది. ఈ మధ్య కాలంలో అనారోగ్యంగా ఉంటోందని, భోజనం వండిపెట్టలేనని చెప్పడంతో ఈ నెల 15వ తేదీ రాత్రి నిందితుడు శ్రీనివాస్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆమెను గెంటివేయడమే కాక ఇంట్లో సామాన్లు పడవేసి భయభ్రాంతులకు గురిచేశాడని, పెట్రోల్ తెచ్చుకుని తాను పోసుకుని చనిపోతాను లేదా ఆమెను చంపేస్తానంటూ బెదిరించడంతో బాధితురాలు లక్ష్మి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

భీమవరం క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమవరంలోని బుధవారం మార్కెట్ కూడలిలో గురువారం మధ్యాహ్నం ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. ఒంటిపై బట్ట లేకుండా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. రెండు రోజులుగా ఆ ప్రాంతంలోనే ఉంటూ మద్యం మత్తులో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. మతిస్థిమితం లేకే అలా ప్రవర్తించాడని, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.